క్లుప్తంగా

అంకాలమ్మ ఆలయ అభివృద్ధి



కారెంపూడి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో పల్నాటి వీర్ల అంకాలమ్మ ఆలయం ముందు ఆవరణలో అభివృద్ధి పనులు బుధవారం కొనసాగాయి. ఆలయం ముందున్న ధ్వజస్తంభం బొండ్రాయి మధ్య ప్రాంతంలో కాంక్రీటు పరిచి భక్తుల సౌకర్యార్థం శుభ్రం చేశారు. పల్నాటి ఉత్సవాలు కూడా సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణం శుభ్రంగా ఉండేందుకు వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు ఈ పని చేయించాలని అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యేను ఆలయ పూజారులతోపాటు గ్రామస్తులు కోరడంతో వెంటనే ఆ పని చేయించాలని ఎమ్మెల్యే స్థానిక నాయకులు ఆదేశించడంతో వారు ఈ పనులను బుధవారం పూర్తి చేశారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



దాచేపల్లి : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ డిమాండ్ చేశారు. నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఏఐవైఎఫ్ నిర్మాణ మహాసభ బుధవారం నిర్వహించారు. సుభానీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు విడుదల చేయకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అమ్ముతోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలను స్మరించుకుని విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు పని చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో షేక్ హుస్సేన్, మందపాటి రమణరెడ్డి, కొమెర వెంకటరావు, పత్తిపాటి వెంకట నాగరాజు, చల్లా ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయంలో కార్తిక మాస ప్రత్యేక పూజలు



కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం నుంచి కార్తిక మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు బుధవారం తెలిపారు. ప్రతి రోజు గణపతిహోమం, మాల ధారణ చేసిన స్వాములకు చద్ది (భోజనం) ఏర్పాట్లు దాతల సహకారంతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. దామోదరాష్టకం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడంతో పాటు స్వామి వారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్తిక మాసం ముగిసేంత వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇదిలా ఉంటే మండలంలోని అన్ని ప్రముఖ దేవాలయాలలో కార్తిక మాస ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

రక్షిత మంచినీటిని అందిద్దాం



పిడుగురాళ్ల: సురక్షిత మంచినీటిని పట్టణ ప్రజలకు అందిద్దామని మున్సిపల్ కమిసనర్ పర్వతనేని శ్రీధర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని చెరువుకట్ట బజారులోని పంప్ హౌస్‌లోని వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మంచినీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు రక్షిత మంచినీరు అందించేలా పని చేద్దామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

21 మద్యం సీసాలు స్వాధీనం

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలోని బీసీ కాలనీలోని ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉన్న 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని గృహ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేర గ్రామంలోని బీసీ కాలనీలోని బొడ్డేటి శేఖర్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతని గృహంలో తనిఖీలు నిర్వహించగా 21 మద్యం(180ఎం.ఎల్)సీసాలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

కంది పంటపై గంపెడాశలు

- 12 వేల ఎకరాలలో సాగు
- గత ఏడాది కంటే రెట్టింపు విస్తీర్ణంలో పంట
- ధరపైనా ఆశాభావం



ఏపుగా పెరిగిన కంది పంట

దుర్గి: అధిక వర్షాల నేపథ్యంలో పత్తి పంట దెబ్బ తినటం, మిర్చి ధరలు అనుకూలంగా లేకపోవటంతో ఈ ఖరీఫ్‌లో రైతులు కంది పంట సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గత ఏడాది కంటే రెట్టింపు విస్తీర్ణంలో కందిని సాగు చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా దాల్ మిల్లులకు కేంద్రమైన దుర్గి, పరిసర ప్రాంతాలలో రైతులు కంది పంటను వేసి పండించిన పంటను నేరుగా మిల్లులకు తరలిస్తుండటంతో వారికి అనుకూలమైన ధర వచ్చిన వెంటనే అమ్ముకొని లబ్ధి పొందుతున్నారు. గత సంవత్సరం క్వింటా కందులను రూ.10వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయటంతో రైతులు లబ్ధి పొందారు. ఈ సంవత్సరం కూడా అటువంటి పరిస్థితే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో పత్తి, మిర్చి పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న రైతులు క్రమేణా వాటి సాగు విస్తీర్ణం తగ్గించి కంది పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అదే విదంగా పత్తి, మిర్చిలకు ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతోంది. కూలీల కొరత వల్ల రైతులు కష్టాలు పడుతున్నారు. ఎక్కువ కూలిరేట్లు చెల్లించాల్సి వస్తోంది. కంది పంటకు పెట్టుబడి తక్కువగా ఉండటం, కూలీలతో పనిలేకుండా కోత మిషన్లు రావటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

పంట బాగుంది



గతంలో ఎన్నడూ లేని విధంగా అనుకూలంగా వర్షాలు కురవటంతో కంది పంట బాగా ఉంది. గత సీజన్‌లో 5,300ల ఎకరాల్లో సాగు చేయగా, ఈ సీజన్‌లో 12వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే పంట కల్లెకు వస్తున్నందున రైతులు పచ్చ పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– వై.అమీర్‌రెడ్డి, ఏఓ, దుర్గి

పంట బాగుంది



అధిక పెట్టుబడులు పెట్టి మిర్చి పంటను సాగు చేస్తే ధరలు స్థిరంగా లేకపోవటంతో వచ్చిన రేటుకు అమ్ముకోవాల్సి వచ్చింది. కందికి ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించటంతో నేను 15 ఎకరాల్లో కంది పంట సాగు చేస్తున్నా. ప్రస్తుతానికి పంట చాలా బాగుంది. వాతావారణం అనుకూలిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఆశతో ఉన్నాను.

– మద్దికర శివారెడ్డి, కంది పంట రైతు, కోలగుట్ల

పత్తి, మిర్చితో విసిగి వేసారి..



కంది పంట మా ప్రాంతంలో సాగుకు అనుకూలంగా ఉండటంతో ఏటా సాగుచేస్తున్నాం. సగటున ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పత్తి, మిర్చి పంటలతో విసిగి వేసారాం. యంత్రాలు, ట్రాక్టర్ల సాయంతో అధిక విస్తీర్ణంలో కంది పంటను సాగు చేసినా ఇబ్బంది లేదు. కూలీలు, అధిక పెట్టుబడులు అవసరం లేకుండా సాగు చేస్తున్నాను.

– అడపాల అంబారావు, ఆత్మకూరు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న కౌన్సిలర్ దేవళ్ల లక్ష్మీప్రసన్న

దాచేపల్లి : అంజనాపురం కాలనీలో డయేరియాతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని 12వ వార్డు కౌన్సిలర్ దేవళ్ల లక్ష్మీ ప్రసన్న కోరారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ అప్పారావును కార్యాలయంలో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. తన వార్డులో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థికసాయం అందించలేదని, నిరుపేదలైన మృతుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న బాధితులకు కూడా ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని కమిషనర్ అప్పారావు చెప్పారు.

అదుపులో డయేరియా



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియా పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చినట్లు డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య తెలిపారు. అంజనాపురం కాలనీలో బుధవారం కూడా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వాంతులు, విరేచనాల బారిన పడి హస్పిటళ్లలో చికిత్స పొందిన బాధితుల ఇళ్లకు వైద్య సిబ్బంది వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాంతులు, విరేచనాలు తగ్గి ఆరోగ్యంగా ఉన్నామని బాధితులు వైద్యులకు వివరించారు. డయేరియా ప్రస్తుతం అదుపులోనే ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డాక్టర్ అమూల్య చెప్పారు.

విజ్ఞాన యాత్రలతో విద్యార్థులకు మేలు



నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సత్రశాల(రెంటచింతల): విజ్ఞాన యాత్రల ద్వారా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చని ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు డెప్యూటీ ఈఈ మెహమూద్ చెప్పారు. మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బుధవారం ఐటీఅండ్ ఐటీఈఎస్ సేవలపై సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో డెప్యూటీ ఈఈ మెహమూద్ అవగాహన కల్పించారు. విద్యుదుత్పాదన గురించి వివరించారు. భవిష్యత్తు అంతా సాంకేతిక పరిజ్ఞానానిదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీఅండ్ ఐటీఈఎస్ వృత్తి విద్య జిల్లా సమన్వయకర్త అయ్యప్పస్వామి, స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య, ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, విద్యాసాగర్, జనార్దన్‌రావు, కుమార్, అలేఖ్య, జబీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ప్రసాద్‌కు వీడ్కోలు సత్కారం

కారెంపూడి: ఉద్యోగ విరమణ చేయనున్న తహసీల్దార్ బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్‌కు బుధవారం రాత్రి రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు వీడ్కోలు సభ నిర్వహించారు. సుదీర్ఘ కాలం వివిధ హోదాలలో తహసీల్దార్ ప్రసాద్ ప్రజలకు చేసిన సేవలను కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కొనియాడారు. తహసీల్దార్ దంపతులను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, గ్రామ సహాయకులు సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇదిలా ఉంటే పెదకొదమగుండ్ల ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న ఎ.వెంకటప్పారెడ్డి కూడా ఉద్యోగవిరమణ చేయనున్న సందర్భంగా గ్రామ పెద్దలు ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు.

మొసళ్ల కలకలం

- వారం వ్యవధిలో పిడుగురాళ్ల, మాచవరంలలో ప్రత్యక్షం
- పట్టుకోవడంలో అటవీశాఖ అధికారులు విఫలం
- బోన్ ఏర్పాటుచేసినా వెంటనే తీసేశారు



పిడుగురాళ్ల బైపాస్ రోడ్డుపై కనిపించిన మొసలి



మొసలిని పట్టుకునేందుకు అటవీ శాఖాధికారులు ఏర్పాటు చేసిన బోను

పిడుగురాళ్ల: క్వారీ, వాగులు, గుంతల నుంచి మొసళ్లు ఒక్కసారిగా ప్రధాన రహదారిలోకి రావటంతో వాహనదారులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల రిక్షా కాలనీ సమీపంలోని బైపాస్ రోడ్డుపై పెద్ద మొసలి అర్ధరాత్రి ప్రత్యక్షమైంది. దీంతో భయపడిన వాహనదారులు మొసలి రోడ్డు దాటేంత వరకూ ఆగిపోయారు. కొంత సమయం తర్వాత రోడ్డు దాటి బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న బురద మడుగులోకి మొసలి వెళ్లిపోయింది. తాజాగా మంగళవారం మాచవరం మండలంలోని వేమవరం గ్రామంలో మొసలి రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. దీంతో ప్రజలు బెంబేలెత్తారు. పిడుగురాళ్ల పట్టణంలోని రిక్షా కాలనీ వద్ద మొసలి ఆనవాళ్లు సేకరించిన అటవీశాఖ అధికారులు దానిని బంధించేందుకు బోన్లను పెట్టారు. అయితే వాటిని తెల్లారేసరికి తీసేశారు. మొసలి ఇంకా కనపడలేదు. ఇప్పటికీ బైపాస్ రోడ్డులో మొసలి సంచరించటంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు మొసళ్లను బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

భయమేస్తోంది



పిడుగురాళ్లలో మొసళ్లు సంచరిస్తున్నాయని చెబుతుంటే భయమేస్తోంది. ఏ క్షణంలో ఏ ప్రాంతానికి వస్తాయోనని ఆందోళన చెందుతున్నాం. గతంలో మొసళ్లు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులు పట్టుకొని నాగార్జున సాగర్‌లో వదిలిపెట్టేవారు. ఇప్పుడు మొసలిని ఫారెస్ట్ అధికారులు పట్టుకోలేకపోయారు.

– అజ్మీర శారద, 6వ వార్డు కౌన్సిలర్ పిడుగురాళ్ల

బైపాస్ రోడ్డుపై కనిపించడం తొలిసారి



పిడుగురాళ్ల పట్టణంలోని బైపాస్‌రోడ్డులో మొసలి సంచరించటం ఇదే ప్రథమం. మేము నివేసించేంది కూడా బైపాస్ సమీపంలోనే నివస్తున్నాం. ఎప్పుడు అది ఇళ్లల్లోకి వస్తుందోనని మా ప్రాంత వాసులందరూ భయపడుతున్నారు.

– షేక్ జానిబాబు, పిడుగురాళ్ల

మొసలిని పట్టుకునేందుకు కృషి



పిడుగురాళ్లలో సంచరించిన మొసలిని పట్టుకునేందుకు మా ఫారెస్ట్ సిబ్బందితో కలిసి తీవ్రంగా శ్రమించాం. దానిని బంధించేందుకు బోనునూ ఏర్పాటు చేశాం. కానీ మా ప్రయత్నాలు ఫలించలేదు. సిబ్బందితో ఆ ప్రాంతంలో నిఘా పెంచాం. అది కనిపిస్తే తక్షణం పట్టుకుంటాం. జన సంచారంలోకి రాకుండా చూస్తాం.

– బీవీఎల్ నాయుడు, డెప్యూటీ ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్, పిడుగురాళ్ల

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



డీఈఓ చంద్రకళను కలసిన రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. నూతనంగా డీఈఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రకళను బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. ఈసందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. అలాగే ఉపాధ్యాయులు పాఠశాలల నిర్వహణ, నాణ్యమైన విద్యా బోధన, విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాల పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. డీఈఓ చంద్రకళను కలసిన వారిలో సంఘం జాతీయ ఆర్థిక కార్యదర్శి సి.హెచ్.జోసఫ్ సుధీర్ బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వి. రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర నాయకులు ఎస్.ఎం.సుభానీ, వెంకట కోటయ్య, ఎ.ఏమండీ, భీష్మారావు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నాగులేరులో తేలాడుతున్న గుర్తుతెలియని మృతదేహం

దాచేపల్లి : స్థానిక శివాలయం వెనుక నాగులేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. సుమారుగా 50 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహం నాగులేరులో తేలాడుతుంటే ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉన్నది. పోలీసులు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

వినుకొండ(నూజెండ్ల): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీల శక్తిసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, ఇతర వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ల నియామకానికి కృషి

మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



23వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఆయుర్వేద వైద్యశాలలో పది నెలలుగా వైద్యులు లేరని, తక్షణమే వైద్యుల నియామకం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సమావేశం చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా మున్సిపల్ అధికారి రంజిత్ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీను ఆయుర్వేద వైద్యులు లేక పది నెలలు అవుతుందని, అందులో రూ. 20 లక్షల విలువగల మందులు ఉన్నాయని సభ దృష్టికి తీసుకొని రావటంతో స్పందించిన చైర్మన్ స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయుర్వేద వైద్యులను నియమించేందుకు కృషి చేస్తామన్నారు.

నీటి కనెక్షన్‌కు రూ.7,500లా!

నీటి పన్ను చెల్లించకుంటే కనెక్షన్ తొలగించాల్సి వస్తుందని, మంచినీటి సరఫరాకు మున్సిపాలిటీకి సుమారు రూ.64 లక్షలు ఖర్చు అవుతుందని, పన్ను రూపేణా మాత్రం రూ. 6 లక్షలు కూడా రావటం లేదని అధికారులు తెలిపారు. వాటర్ ట్యాప్‌కు రూ.7,500లు తప్పనిసరిగా వసూలు చేయాలని అధికారులు సభ దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో కౌన్సిల్ సభ్యులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెయ్యి రూపాయల లోపు హౌస్ ట్యాక్స్ ఉన్న వారికి రూ.200కు నీటి కనెక్షన్ ఇచ్చిందని, ఇప్పుడు రూ.7500లు అంటే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై కౌన్సిల్ ఒక నిర్ణయానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వినతి

బ్యాంకుల వద్ద షాపింగ్ మాల్స్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని 9వ వార్డు కౌన్సిలర్ మాధాల కిరణ్ తెలిపారు. 23వ వార్డులో విద్యుత్ స్తంభాలు నూతనంగా ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ శ్రీరంగ రజని మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. గర్నె నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమ వార్డులో వాటర్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. జెడ్పీ హైస్కూల్ పక్క వీధిలో, రావిళ్ల హోటల్ పక్క వీధిలో మూత్ర విసర్జన చేస్తున్నారని అరికట్టి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కో–ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ మాట్లాడుతూ.. డయేరియా ప్రబలినప్పుడు మంజూరు అయిన నిధుల్లో ఎంత ఖర్చు అయ్యాయని ప్రశ్నించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. కౌన్సిలర్లు ప్రస్తావించిన సమస్యలను వచ్చే సమావేశం నాటికి పరిష్కరించేందుకు అధికారులంతా కృషి చేయాలని ఆదేశించారు. పిడుగురాళ్ల పట్టణంలోని 17 సచివాలయాలకు 17 మంది వీఆర్వోలకు ముగ్గురు మాత్రమే సమావేశంలో ఉన్నారని, మిగిలిన వీఆర్ఓలు విధులకు హాజరయ్యేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, ఏఈ ఎన్. చంద్రశేఖర్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, టీపీఎస్ అనురాధ, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫైర్‌లెస్ కుకింగ్ పోటీలు



ఫాతిమా విద్యానికేతన్ స్కూల్లో ఫైర్ లెస్ కుకింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

రెంటచింతల: స్థానిక ఫాతిమా విద్యానికేతన్ స్కూల్లో బుధవారం సెమీ దీపావళి వేడుకలలో భాగంగా నిర్వహించిన ఫైర్ లెస్ (నిప్పు లేని వంట) కుకింగ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల వంటలను తయారు చేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులలో సృజనాత్మకతను వ్యక్తీకరించడానికి.. వారిలోని సామర్థ్యాలను పెంచడానికి ఈ పోటీలు ఎంతగానో సహాయపడతాయని స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి అన్నారు. దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తుందన్నారు. తరాలు మారినా మన సంస్కృతి సంప్రదాయాలను మనం ఎప్పుడూ గౌరవించాలన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏరువ స్టేఫీ స్టార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు



బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాచర్ల : స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో దీపావళి వేడుకలు బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ అజ్ఞాన చీకట్లను పారదోలి మన జీవితంలో వెలుగులు నింపేది దీపావళి అన్నారు. నరకాసురుని వధించి నరులందరి జీవితాలలో వెలుగును నింపిన మాత సత్య శౌర్యానికి, చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారన్నారు. బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దాచేపల్లి : నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ చెప్పారు. స్థానిక సచివాలయంలో కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. నగర పంచాయతీలో చేపట్టాల్సిన పలు అంశాలపై సభ్యులు చర్చించారు. అంజనాపురం కాలనీలో ఇటీవల డయేరియా ప్రబలిన నేపథ్యంలో నగర పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆరోగ్య సిబ్బంది చేసిన సేవలను కౌన్సిల్‌లో అభినందించారు. నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని, కౌన్సిలర్ల పరిధిలో ఉన్న సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని చైర్‌పర్సన్ సుబ్బమ్మ కోరారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కమిషనర్ ఎంవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వేల్పూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల ఇరువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26న చిలుకలూరిపేట మండలం పసుమర్రులో జరిగిన బాల్ బ్యాడ్మింటిన్ జిల్లా పోటీల్లో జరగ్గా అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి బొల్లా షణ్ముఖ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. అలాగే రగ్‌బీ క్రీడా పోటీల్లో ఈనెల 30న నూతక్కిలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నుంచి మర్రి వెంకట శ్రీవల్లి (8వతరగతి) విద్యార్థి ఎంపికై నట్లు తెలిపారు. ఇరువురు విద్యార్థులను సర్పంచ్ బీర్పేడి రత్నగిరి, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఎంపీటీసీ లింగా శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.